
ఆంధ్రజ్యోతి
రంజాన్ వేళలు సోమవారం(ఇఫ్తార్-6:38), మంగళవారం (సహెర్-4:44)
ANDHRAJYOTHY
3

నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
సోమవారం 8 ఏప్రిల్ 2024

అగ్నిమాపక శాఖలో.. సిబ్బంది కొరత

- ఫైర్‌మెన్ పోస్టులు సగం ఖాళీ
- నీటి కోసం మునిసిపాలిటీ బోర్లే దిక్కు
- జడ్చర్లలో ఏళ్ల తరబడి ప్రతిపాదనల్లోనే సొంత భవనం
- ఆగస్టులో ఉమ్మడి జిల్లాకు రానున్న 88 మంది ఫైర్‌మెన్‌లు

● మక్తల్‌లో గతేడాది అక్టోబరులో కొత్తగా అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మహబూబ్‌నగర్‌లో రెండు అగ్నిమాపక వాహనాలు ఉండగా ఒక వాహనాన్ని అక్కడికి పంపించి సర్దుబాటు చేశారు. కానీ.. సరిపోను సిబ్బంది లేరు. ఒక కేంద్రంలో 10 మంది ఫైర్‌మెన్‌లు, ఇద్దరు లీడ్ ఫైర్‌మెన్‌లు, ముగ్గురు డ్రైవర్లు, స్టేషన్ ఆఫీసర్ ఒకరు ఇలా 16 మంది ఉండాలి. కానీ మక్తల్‌లో ప్రస్తుతం ముగ్గురు ఫైర్‌మెన్‌లు, ఇద్దరు లీడ్ ఫైర్‌మెన్‌లు, ఇద్దరు డ్రైవర్లు మాత్రమే ఉన్నారు. తొమ్మిది పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

● మహబూబ్‌నగర్‌లో ఆరు, జడ్చర్లలో ఆరు, నారాయణపేటలో ఐదు ఫైర్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉన్న సిబ్బందిలో కొందరిని ఆర్టీసీ నుంచి డ్రైవర్లుగా తీసుకోగా, పోలీస్ డిపార్ట్‌మెంట్ హోంగార్డులను కొందరిని ఫైర్‌మెన్ సేవలకు వినియోగించుకుంటున్నారు. మొత్తంగా అగ్నిమాపక శాఖలో ఆరుమంది ఆర్టీసీ డ్రైవర్లు, ఏడుగురు పోలీస్‌శాఖ హోంగార్డులు పనిచేస్తున్నారు. కొత్తవారు రిక్రూట్ అయితే ప్రభుత్వ ఆదేశానుసారం వారు తిరిగి వాళ్ల శాఖలకు వెళ్లే అవకాశం ఉంది.

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 7: ఎండాకాలం వచ్చిందంటే అగ్ని ప్రమాదాలు ఎక్కువ జరుగుతుంటాయి. అగ్గిరాజుకుంటే వెంటనే అగ్నిమాపక శాఖ గుర్తుకు వస్తుంది. అలాంటి అగ్నిమాపక శాఖను సిబ్బంది కొరత వెక్కిరిస్తోంది. ఒక్కో కేంద్రంలో 16 మంది పని చేయాల్సి ఉండగా, చాలా స్టేషన్‌లలో సగం ఖాళీలు ఉన్నాయి. దాంతో ఉన్న సిబ్బందిపై భారం పడటంతోపాటు.. ప్రమాదాలు జరిగితే మంటలను ఆర్పేందుకు సిబ్బంది చాలక ఎక్కువ నష్టం వాటిల్లుతోంది. సరిపోను సిబ్బంది ఉంటే ప్రమాదం జరిగినప్పుడు నష్ట నివారణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. మరో మూడు నెలల్లో అంటే ఆగస్టు నాటికి ఉమ్మడి పాలమూరు జిల్లాకు 88 మంది ఫైర్‌మెన్‌లు, 25 మంది డ్రైవర్లు వస్తారని అధికారులు చెబుతున్నారు. వారు వస్తే ఉన్న సిబ్బందిపై ఒత్తిడి తగ్గనుంది.


మహబూబ్‌నగర్ డివిజినల్ అగ్నిమాపక శాఖ కార్యాలయం


అగ్నిమాపక వాహనం

సమస్యల మధ్య నెట్టుకొస్తున్న శాఖ

అగ్నిమాపక శాఖ పలు సమస్యల మధ్య నెట్టుకొస్తోంది. సరిపోను సిబ్బంది లేకపోవడంతో ఉన్నవారితోనే బండిని నడిపిస్తున్నారు. పలు స్టేషన్‌లకు సొంత భవనాలు లేవు. మహబూబ్‌నగర్ కార్యాలయాన్ని రెండేళ్లక్రితం సొంత భవనంలోకి మార్చారు. జడ్చర్లలో ఏళ్ల తరబడి రేకులషెడ్డులోనే స్టేషన్‌ను నడిపిస్తున్నారు. భవన నిర్మాణం కోసం ప్రతిపాదనలు ఉన్నా మంజూరుకు నోచుకోవడం లేదు. కొత్తగా ఏర్పాటైన మక్తల్, అలంపూర్‌లకు కూడా సొంత భవనాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. పలు స్టేషన్‌లలో బోర్లు లేవు. వీరంతా స్థానికంగా ఉన్న మునిసిపాలిటీ బోర్ల ద్వారా నీటిని సమకూర్చుంటున్నారు. ఎండాకాలంలో విద్యుత్ లోడ్ పెరగడం వల్ల షార్ట్‌సర్క్యూట్‌తో ఎక్కువగా అగ్ని ప్రమాదాలు జరుగుతుంటాయి. యాసంగి సీజన్ అయిపోయాక పొలాల్లో గట్టి, పంటల కట్టెలు, సొప్పలను కాల్చుతుంటారు. కొన్నిసార్లు గాలికి మంటలు వ్యాపించి ఇతర ప్రాంతాలలో అగ్ని ప్రమాదాలు జరుగుతంటాయి. 15-20 రోజులుగా ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల అగ్నిప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వేసవి రెండు నెలలు ఈ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

ఉన్న వనరులతో మెరుగైన సేవలు

ఉమ్మడి జిల్లాలో సిబ్బంది కొరత ఉన్నా.. ఉన్న సిబ్బందితో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రమాదాలు జరిగినప్పుడు ఆస్తి, ప్రాణనష్టం లేకుండా చూస్తున్నాం. అన్ని కేంద్రాలలో వాహనాలు, నీటికి ఇబ్బందులు లేవు. వేసవిలో మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. ఉమ్మడి జిల్లాకు 88 మంది ఫైర్‌మెన్‌లు, 25 మంది డ్రైవర్లు రాబోతున్నారు. ప్రస్తుతం శిక్షణ తీసుకుంటున్న వీరు ఆగస్టు నాటికి వస్తారు. వారు వస్తే మరింత మెరుగైన సేవలందిస్తాం.

- కిశోర్, అగ్నిమాపకశాఖ అధికారి


అమ్రాబాద్ మండలం సార్లపల్లిలో వృథాగా ఉన్న తాగునీటి ట్యాంక్

- నిరుపయోగంగా మిషన్ భగీరథ(ఇంట్రా) వాటర్ ట్యాంకులు
- పగిలిన పైపులు.. పాడైన బోర్లు
- పట్టించుకోని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు
- తాగునీటి కోసం సార్లపల్లి, కుడిచింతలబావి గిరిజనుల ఇక్కట్లు

లక్షలు వెచ్చించినా.. నెరవేరని లక్ష్యం


కుడిచింతలబావిలో పాడయిన సోలార్ ప్లాంట్, బోరు మోటారును చూపుతున్న మాజీ వార్డు సభ్యుడు వెంకటేష్

దోమలపెంట, ఏప్రిల్ 7: నల్లమలలోని అమ్రాబాద్ మండలం సార్లపల్లి, కుడిచింతలబావి గిరిజన గ్రామాలకు తాగునీటిని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ(ఇంట్రా) పథకంలో భాగంగా రూ.95 లక్షలు కేటాయించినా లక్ష్యం నీరుగారి పోయింది. అచ్చంపేట మండలానికి చెందిన గత అధికార పార్టీ బీఆర్ఎస్ నాయకుడు కాంట్రాక్టు దక్కించుకుని పనులు చేపట్టాడు. పనులు సకాలంలో పూర్తి చేయకపోగా, నాణ్యతను మరిచారు. సార్లపల్లిలో 60 వేల లీటర్లు, కుడిచింతలబావిలో 40 వేల లీటర్ల నీటి సామర్థ్యం గల వోహెచ్ఎస్ఆర్ (వోవర్ హెడ్ వాటర్ స్టోరేజ్ రిజర్వ్) ట్యాంకులు నిర్మించారు. ఆయా గ్రామాల్లోని సోలార్ బోర్ల ద్వారా నీటిని ట్యాంకులకు మళ్లించి ఇంటింటికి తాగునీటిని అందించాలని ఈ పథకం సదుద్దేశం. కానీ కాంట్రాక్టర్ ఇచ్చే మామూళ్లకు ఆశపడిన అధికారులు నాసిరకం పైపులు, నల్లాలు బిగించి, నాణ్యత విస్మరించినా బిల్లులు చెల్లించారు. ఫలితంగా మూడేళ్లుగా సార్లపల్లి గ్రామంలో నల్లాల ద్వారా ఇప్పటి వరకు నీటిని సరఫరా చేయలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. కుడిచింతలబావిలో నెల రోజులకు మించి నీటిని సరఫరా చేయలేదని అంటున్నారు. ఈ విషయమై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. పథకం ప్రారంభం కాకుండానే పైపులైను ఊడిపోయి, నల్లాలు విరిగిపోయాయి. కానీ అధికారులు మాత్రం అలాంటిదేమీ లేదని, రోజూ ఇంటింటికి నల్లా ద్వారా నీరు సరఫరా అవుతోందని చెబుతున్నారు. కలెక్టర్ స్పందించి నాసిరకంగా పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని.. రోజూ ఇంటింటికీ నీళ్ల వచ్చేలా చూడాలని కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు..

మా గ్రామంలో మిషన్ భగీరథ పథకం కింద వేసిన నల్లాలు, పైపులు విరిగిపోయాయి. వాటిని సరి చేసి, ఇంటింటికి నీరివ్వాలని గ్రామ సభల్లో అధికారులకు చాలా సార్లు ఫిర్యాదు చేసినా పటించుకోవడం లేదు. లక్షల రూపాయలు ఖర్చు చేసి, ట్యాంకు నిర్మించి, పైపులైన్లు వేసి, నల్లాలు బిగిస్తే ప్రజలకు కాకుండా కాంట్రాక్టర్, అధికారులకే మేలు జరిగింది.

- ఎల్కచేను వెంకటేష్, మాజీ వార్డు సభ్యుడు, కుడిచింతలబావి

అన్నీ సక్రమంగానే ఉన్నాయి

సార్లపల్లి, కుడిచింతబావి గ్రామాలలో ఇంటింటికి నల్లాల ద్వారా తాగు నీరు అందుతోంది. అన్ని సక్రమంగానే ఉన్నాయి. అక్కడక్కడా పైపులు సరిగా లేవు. బోరుమోటారు బాగు చేయించి నీటిని సరఫరా చేస్తాం.

- సందీప్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, అమ్రాబాద్


సార్లపల్లిలో మూడు సంవత్సరాల క్రితం ఊడిపోయిన పైపులైన్ జాయింట్


సార్లపల్లిలో తాగునీటి ట్యాంకు వద్ద నీటిని తీసుకెళ్తున్న చిన్నారులు


గైర్హాజరైన పోలింగ్ సిబ్బందికి నేడు చివరి అవకాశం

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), ఏప్రిల్ 7 : మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో మూడు నియోజకవర్గాల పోలింగ్ సిబ్బందికి ఏర్పాటు చేసిన మొదటి విడత శిక్షణ ఆదివారంతో పూర్తయ్యింది. ఈ శిక్షణకు గైర్హాజరైన పోలింగ్ సిబ్బందికి నేడు (సోమవారం) మరో చివరి అవకాశం కల్పించినట్లు జిల్లా పోలింగ్ శిక్షణా నోడల్ అధికారి డాక్టర్ శ్రీధర్ తెలిపారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గం వారికి ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో, జడ్చర్ల నియోజకవర్గం వారికి జడ్చర్లలోని బీఆర్ఆర్ డిగ్రీ కళాశాల, దేవరకద్ర నియోజకవర్గం వారికి మహబూబ్‌నగర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో రోజుకు (శని, ఆదివారాలలో) రెండు బ్యాచుల చొప్పున మొత్తం నాలుగు బ్యాచులుగా 1233 మంది పీవోలు, 1219 మంది ఏపీవోలు, 2355 మంది వోపీవోలకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ శిక్షణకు గైర్హాజరైన పోలింగ్ సిబ్బంది పీవో, ఏపీవో, వోపీవోలకు సోమవారం (నేడు 9వ తేదీ) చివరి అవకాశం కల్పించినట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఎటువంటి సమాచారం లేకుండా గైర్హాజరైన వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్, సహాయ రిటర్నింగ్ అధికారులు నవీన్, ముకుందరెడ్డి, రెవెన్యూ సిబ్బంది. ఆరుగురు జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లు, 26 మంది మాస్టర్ ట్రైనర్లు, 26 మంది సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌కు నేడు కేటీఆర్ రాక

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు సోమవారం నాగర్‌కర్నూల్‌కు రానున్నట్లు మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11గంటలకు కొల్లాపూర్ చౌరస్తాలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో పార్లమెంట్ స్థాయి విస్తృత కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొననున్నారు. సమావేశానికి బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఆ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, హాజరుకానున్నారు.

నిప్పుల కొలిమి



మహబూబ్‌నగర్, ఏప్రిల్ 7: భానుడి ప్రతాపానికి ఉమ్మడి పాలమూరు జిల్లాలు నిప్పుల కొలిమిలా మారాయి. సాయంత్రం ఏడు ఎనిమిది గంటలు దాటినా ఉక్కపోత, వడగాలులు తగ్గడం లేదు. 44వ నెంబర్ జాతీయ రహదారి సమీపంలోని అడ్డాకులలో ఆదివారం 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గండీడ్ మండలంలో 42.6, దేవరకద్రలో 42.1, మూసాపేటలో 41.2 డిగ్రీలు నమోదవగా, పలు మండలాలలో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. శనివారంతో పోలిస్తే ఆదివారం కాస్త తక్కువగానే ఉష్ణోగ్రత నమోదైంది. మహబూబ్‌నగర్ జిల్లాలోని మూడు మండలాలు మినహా మిగతా అన్ని మండలాలు ఆరెంజ్ జోన్‌లో ఉన్నాయి. శనివారం 10 మండలాలు ఆరెంజ్‌జోన్‌లో ఉన్నాయి. సోమవారం కూడా ఉష్ణోగ్రత ఎక్కువగానే నమోదయ్యే అవకాశాలున్నాయి.

● వనపర్తి జిల్లాలో ఆదివారం 44.3 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత, 28.7 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదయ్యింది. కొత్తకోట మండలంలోని కానాయపల్లిలో 44.3 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత, అత్యల్పంగా 28.0 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. పెబ్బేరులో 44.1, అత్యల్పంగా 25.8, చిన్నంబావిలో అత్యధికంగా 43.2, అత్యల్పంగా 28.1, ఆత్మకూరులో అత్యధికంగా 42.5 , అత్యల్పంగా 26.4 ఉష్ణోగ్రత నమోదయింది. పానుగల్‌లో అత్యధికంగా 42.4 , అత్యల్పంగా 23.9, గోపాల్‌పేట, శ్రీరంగాపూర్, మదనాపూర్‌లో అత్యధికంగా 42.1 , అత్యల్పంగా 25.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. అమరచింతలో అత్యధికంగా 42.0, అత్యల్పంగా 25.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. ఘణపూర్, వీపనగండ్ల, పెద్దమందడిలలో అత్యధికంగా 41.8, అత్యల్పంగా 26.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. రేవల్లి, వనపర్తిలో అత్యధికంగా 40.7 డిగ్రీల ఉష్ణోగ్రత , అత్యల్పంగా 28.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది.

● నాగర్‌కర్నూల్ జిల్లాలో ఆదివారం గరిష్ఠ ఉష్ణోగ్రత 41 డిగ్రీలు నమోదు కాగా, కనిష్ఠ ఉష్ణోగ్రత 28 డిగ్రీలుగా నమోదైంది. కొల్లాపూర్‌లో అత్యధికంగా 43.3, వంగూరులో 43.2, అచ్చంపేటలో 43.1, బిజేపల్లిలో 42.6, పెద్దకొత్తపల్లిలో 42.5, చారకొండలో 42.4, కల్వకుర్తిలో 42.3 గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

● జోగుళాంబ గద్వాల జిల్లా ఆదివారం 40 డిగ్రీల ఉష్ణోగ్రత దాటి ఆరెంజ్ జోన్‌లోకి వెళ్లింది. ఇటిక్యాల, వడ్డేపల్లిలో 43.7 డిగ్రీలు దాటింది. గద్వాల, ధరూర్, అయిజలో 43.4 అలంపూర్‌లో 43.3, కేటీదొడ్డిలో 42.9, ఉండవెల్లిలో 42.7, మల్దకల్‌లో 42.2, రాజోలిలో 42.2, మానవపాడులో 42.1చ గట్టులో 40.1 డిగ్రీలుగా నమోదు అయ్యింది. అదే సందర్భంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 25 డిగ్రీల నుంచి 27 డిగ్రీల మధ్య ఉంది.

● నారాయణపేట జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రత 41 డిగ్రీలు నమోదు కాగా, కనిష్ఠంగా 28 డిగ్రీలు నమోదయ్యాయి. జిల్లా ఆరెంజ్ జోన్‌లో ఉంది.

నిఘా కట్టుదిట్టం



పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భద్రత పెంచిన పోలీసులు

- జోగుళాంబ గద్వాల జిల్లాలో ఆరు చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీ
- నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న మద్యం, డబ్బు, ఆభరణాల స్వాధీనం
- ఇప్పటి వరకు రూ.21,39,900 నగదు పట్టివేత
- 1135.815 లీటర్ల మద్యం సీజ్
- 52 కేసుల్లో 85 మంది బైండోవర్

గద్వాల క్రైం, ఏప్రిల్ 7: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జోగుళాంబ గద్వాల జిల్లాలో పోలీసులు నిఘా ఉంచారు. నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న నగలు, నగదును స్వాధీనం చేసుకుంటున్నారు. రాష్ట్రంలో ఇతర ప్రాంతాల కంటే ఇక్కడ ఎన్నికల్లో గొడవలు జరిగే ఆస్కారం ఉంటుందన్న ఉద్దేశంతో గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లో భద్రత కట్టుదిట్టం చేశారు. చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నిఘా ముమ్మరం చేశారు.

భారీగా నగదు, మద్యం, వస్తువుల పట్టివేత

జిల్లాలో ఎన్నికల షెడ్యూల్ ప్రారంభం అయిన నాటినుంచి ఇప్పటివరకు భారీగా నగదు, మద్యం, వస్తువులను పట్టుకొని జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అప్పగించారు. రోజూ జిల్లాలో ఎక్కడో ఒకచోట నగదు, మద్యం పట్టుపడుతూనే ఉంది. ఇప్పటివరకు 11 కేసుల్లో రూ.21,39,900 నగదు, 71 కేసుల్లో 1135.815 లీటర్ల మద్యం పట్టుకున్నారు. రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్పీ రితిరాజ్ తెలిపారు.

85 మంది బైండోవర్

జోగుళాంబ గద్వాల జిల్లాలో ఇప్పటి వరకు 52 కేసులలో సంబంధం ఉన్న 85 మందిని పోలీసులు బైండోవర్ చేశారు. వారి వల్ల ఎన్నికల్లో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు ఈ చర్యకు ఉపక్రమించినట్లు జిల్లా పోలీసులు తెలిపారు.


పుల్లూరు చెక్‌పోస్టు వద్ద పట్టుకున్న నగదును చూపుతున్న పోలీసులు(ఫైల్)

ఆరు చెక్‌పోస్టులతో నిఘా..

జిల్లాలో ఆరు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, పోలీసులు తనిఖీలు చేపడుతున్నారు. అంతర్ జిల్లాకు సంబంధించి బీచుపల్లి దగ్గర చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. అలాగే ఇంటర్ స్టేట్‌కు సంబంధించి ఐదు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. అవి నందిన్నె, బలిగెర, నుంకేసుల, పుల్లూరు, ర్యాలంపాడు దగ్గర ఏర్పాటు చేశారు. వీటి ద్వారా డబ్బు, మద్యం, నగలు, గిఫ్ట్ పంపకాలపై ప్రత్యేక నిఘా ఉంచారు.

319 సమస్యాత్మక గ్రామాలు

జిల్లాలో సమస్యాత్మక గ్రామాలపై ఎస్పీ రితిరాజ్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. మరోవైపు 100 మంది కేంద్ర బలగాలు జిల్లాకు రాగా.. వారి ద్వారా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిఘా ఉంచనున్నారు. త్వరలో మరింత ఫోర్స్ జిల్లాకు రానున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు.


పట్టుకున్న మద్యాన్ని చూపుతున్న పోలీసులు(ఫైల్)

ప్రజలు సహకరించాలి

పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉంది. అందుకు ప్రజలు సహకరించాలి. పార్టీల నాయకులు, కార్యకర్తలు మద్యం, డబ్బులు, బహుమానాలు ఇస్తే మాకు సమాచారం ఇవ్వాలి. ఓటర్లను బెదిరించినా, ప్రలోభాలకు గురి చేసినా మా దృష్టికి తేవాలి.

- రితిరాజ్, ఎస్పీ, జోగుళాంబ గద్వాల

ఇఫ్తార్ విందులో పార్లమెంట్ అభ్యర్థులు

- పాల్గొన్న డీకే అరుణ, వంశీచంద్‌రెడ్డి


అమరచింతలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న డీకే అరుణ, వంశీచంద్‌రెడ్డి

అమరచింత, ఏప్రిల్ 7: అమరచింతలో హైకోర్టు మాజీ అడిషనల్ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్‌రెడ్డి ఆదివారం ఇచ్చిన ఇఫ్తార్ విందులో మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి, ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, కాంగ్రెస్ అభ్యర్థి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరయ్యారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నిత్యం ఒకరిపై ఒకరు ఆరోపణలు, విమర్శలు చేసుకునే డీకే అరుణ, వంశీచంద్‌రెడ్డి.. ఒకే కార్యక్రమంలో కలిసి పాల్గొనడం ఆసక్తికరంగా మారింది. ఈ కార్యక్రమంలో ఇరువురూ మాట్లాడుకోలేదు. ముస్లింలకు డీకే అరుణ ముందుగా భోజనం వడ్డించి వెళ్లిపోగా.. ఆ తర్వాత వంశీచంద్‌రెడ్డి భోజనం వడ్డించారు.

దేశంలో పోటీ లేని నాయకుడు నరేంద్రమోదీ

» పాలమూరు పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి డీకే.అరుణ

ఆత్మకూరు, ఏప్రిల్ 7 : భారతదేశంలో పోటీలేని నాయకుడు నరేంద్రమోదీ అని, ఆయనకు సాటి ఎవరు రారని పాలమూరు పార్లమెంటు బీజేపీ అభ్యర్థి డీకే.అరుణ వెల్లడించారు. ఆత్మకూరు పట్టణంలోని సాయివాణి ఫంక్షన్ హాల్‌లో ఆత్మకూరు, అమరచింత కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ భద్రత కోసం ఆయన అనునిత్యం శ్రమిస్తూ ఆర్థిక సంక్షోభంలో 11వ స్థానంలో ఉన్న భారతదేశానికి ఐదవ స్థానానికి తెచ్చారన్నారు. దేశాన్ని 40 సంవత్సరాలు పాలించిన కాంగ్రెస్ పార్టీ కుంభకోణాలు చేయడం తప్పా దేశ ప్రజలకు చేసిందేమీ లేదని గుర్తు చేశారు. ఇక రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ అమలు చేసిన మేనిఫెస్టోకు అదనంగా ఆరు గ్యారెంటీలు ఇస్తామని రాష్ట్ర ప్రజలను మభ్య పెట్టి అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు ఆరు గ్యారెంటీలు అమలు చేయడం లేదని ఆరోపించారు. వాస్తవానికి కేసీఆర్ పై ఉన్న వ్యతిరేకతతో కాంగ్రెస్ పార్టీని గెలిపించారు తప్పా కాంగ్రెస్ పార్టీపై అభిమానంతో గెలిపించలేదని అన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీజేపీ చూస్తు ఊరుకోదని అమలు చేసేవరకు కాంగ్రెస్ పార్టీని వదిలి పెట్టే ప్రసక్తే లేదని ఆమె మండిపడ్డారు. వనపర్తి జిల్లా జడ్పీ చైర్మన్ లోకనాథ్‌రెడ్డి, వనపర్తి, నారాయణపేట జిల్లాల అధ్యక్షులు బి.నారాయణ, పడాకుల శ్రీనివాస్, రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

మంత్రి జూపల్లిని కలిసిన తెలుగు సినిమాటోగ్రాఫర్ అసోసియేషన్ నాయకులు



మంత్రి జూపల్లి కృష్ణారావుకు చిత్రపటాన్ని బహూకరిస్తున్న తెలుగు సినిమాటోగ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షుడు డైరెక్టర్ పీజీ.విందా

కొల్లాపూర్, ఏప్రిల్ 7 : తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును ఆదివారం ఆయన నివాస గృహంలో తెలుగు సినిమాటోగ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షుడు, సినిమాతీత ఎక్స్‌పో మేనేజింగ్ డైరెక్టర్ పీజీ.విందా, సీఈవో సీఎస్ ఆర్యలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లికి ఆయన చిత్ర పటంతో కూడిన జ్ఞాపికను బహూకరించారు. తెలంగాణలో సినిమా టెక్నాలజీ ఎగ్జిబిషన్ ద్వారా టూరిజం, అభివృద్ధి కొరకై పలు అంశాలను మంత్రి జూపల్లితో డైరెక్టర్ పీజీ.విందా చర్చించారు. రాష్ట్రం లో పురాతన ప్రాచీన ఆలయాలు, నల్లమల అందాలను వెలుగులోకి తెచ్చేలా మంత్రి సహకారంతో తెలుగు సినిమాటోగ్రాఫర్ అసోసియేషన్ కృషి చేస్తుందని, తద్వారా నిరుద్యోగ యువత ఉపాధితోపాటు వారి కళా నైపుణ్యాన్ని వెలుగులోకి తీసుకొచ్చేలా కృషి చేస్తామని డైరెక్టర్ పీజీ.విందా పేర్కొన్నారు.

కుక్కల దాడిలో 20 గొర్రె పిల్లలు మృతి



మృతి చెందిన గొర్రె పిల్లలు

పాన్‌గల్, ఏప్రిల్ 7 : కుక్కల దాడిలో 20 గొర్రె పిల్లలు మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం జమ్మాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబీకులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో అన్నే కృష్ణయ్యకు చెందిన గొర్రె పిల్లలను ఆదివారం ఇంటి ముందు జల్ల కింద ఉంచి గొర్రెలను మేపేందుకు వాటిని బయటకు తీసుకెళ్లాడు. గ్రామంలోని కుక్కలు గొర్రె పిల్లలపై దాడి చేయడంతో 20 గొర్రె, మేక పిల్లలు, గొర్రె పిల్లలు అక్కడికక్కడే మృతి చెందాయి. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, ప్రభుత్వాలు నివారణ చర్యలు చేపట్టకపోవడంతో మూగజీవాలు ప్రాణాలు కోల్పోతున్నాయని గ్రామస్థులు ఆరోపించారు. బాధిత కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని గ్రామస్థులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

'నేటి ఆర్‌ఎంపీ, పీఎంపీల ఉమ్మడి జిల్లా సమావేశాన్ని జయప్రదం చేయాలి'

వనపర్తి టౌన్, ఏప్రిల్ 7 : ఉమ్మడి పాలమూరు జిల్లా ఆర్‌ఎంపీ, పీఎంపీల యూనియన్ నాయకుల ముఖ్య సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్, ప్రధాన కార్యదర్శి చిన్న డానియల్ ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయచంద్రమోహన్, జన విజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మానందరెడ్డి హాజరు కానున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌ఎంపీ, పీఎంపీలపై జరుగుతున్న దాడులు, తలెత్తుతున్న సమస్యలను సుదీర్ఘంగా చర్చించేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నామని, అదేవిధంగా ఆర్‌ఎంపీలు, పీఎంపీలు తీసుకోవాల్సిన జాగ్రతలపై ముఖ్య అతిథులు అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ప్రతీ ఒక్క ఆర్‌ఎంపీ, పీఎంపీ సమావేశానికి విధిగా హాజరు కావాలని వారు పిలుపునిచ్చారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు

- త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

ఊర్కొండ, ఏప్రిల్ 7: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు చెలరేగి తృటిలో పెనుప్రమాదం తప్పిన సంఘటన ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మాదారం గ్రామంలో మధ్యాహ్నం సమయంలో ఎండ వేడిమితో పాటు ఓవర్ లోడ్ కారణంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు చెలరేగాయన్నారు. అప్రమత్తమైన విద్యుత్ సిబ్బంది సరఫరా నిలిపివేయడంతో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు.

మహిళపై వ్యక్తి దాడి: కేసు నమోదు

బల్మూరు, ఏప్రిల్ 7 : నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండల పరిధిలోని కొడెలపల్లి గ్రామానికి చెందిన శీలం మంగమ్మ(3) అనే మహిళపై అదే గ్రామానికి చెందిన బుర్ర కుర్మయ్య అనే వ్యక్తి కర్రలతో దాడి చేసి తల భాగాన తీవ్రంగా గాయపర్చడంతో అతనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ బాలరాజు కేసు నమోదు చేసుకుని కుర్మయ్యపై చట్టరీత్యా దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు. మంగమ్మ తండ్రి జంగయ్య గత మూడు సంవత్సరాల కిందట యాక్సిడెంట్ అయి చనిపోగా ఆ విషయంలో జంగయ్య కులస్తులు అయిన వారు నిత్యం అప్పుడప్పుడు గొడవలు పడే వారని ఈ విషయంలో ఆదివారం ఉదయం గొడవ పడడంతో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ బాలరాజు తెలిపారు.

హత్యకు కారణమైన సెల్‌ఫోన్ గొడవ

- జీడికుంట తండాలో విషాదం

హన్వాడ, ఏప్రిల్ 7 : సెల్‌ఫోన్ విషయంలో దాయాదుల మధ్య జరిగిన ఘర్షణ హత్యకు దారితీసిన సంఘటన మండలంలోని ఆయోధ్యనగర్ గ్రామపంచాయతీలోని జీడికుంట తండాలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.... శనివారం రాత్రి 9-10గంటల మధ్యలో ఇంటిపక్కన దాయాదుల మధ్య సెల్‌ఫోన్ విషయంలో గొడవ జరిగింది. తండాకు చెందిన కాట్రావత్ నానునాయక్(36), దాయాదులైన కాట్రావత్ సంతోష్, రాందాసు, దేవి, రుక్కాబాయిలు నానునాయక్‌తో గొడవపడ్డారు. నానునాయక్ తలపై నలుగురు కట్టెలతో కొట్టడంతో తలకు తీవ్రగాయాలు అయ్యాయి. జిల్లా ఆసుపత్రికి తరలించారు. నానునాయక్ అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య, ఆరుగురు ఆడపిల్లలు ఉన్నారు. ఆదివారం భార్య ఫిర్యాదు మేరకు హత్యకేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ వెంకటేష్ తెలిపారు. రూరల్ సీఐ గాంధీనాయక్ సంఘటన స్థలాన్ని పరిశీలించి నిందితులను విచారించారు. అక్కడ జరిగిన సంఘటనను సాక్షుల ద్వారా తెలుసుకున్నారు.

గ్రామ పంచాయతీ నోటీసు బోర్డు తొలగింపుపై ఫిర్యాదు



గ్రామ పంచాయతీ వారు ఏర్పాటు చేసిన నోటీసు బోర్డును తొలగించిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

భూత్పూర్, ఏప్రిల్ 7 : అనుమతులు లేని లేఅవుట్లు తయారు చేసి భూములు అమ్ముతున్నారని, గ్రామ పంచాయతీ వారు ఏర్పాటు చేసిన నోటీసు బోర్డును తొలగించారని పంచాయతీ కార్యదర్శి ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని మద్దిగట్ల గ్రామ శివారులో ఉన్న సర్వే నంబరు 127, 128, 129, 130, 242, నుంచి 248 వరకు ఉన్న సర్వే నెంబర్లలో సుమారు 80 ఎకరాల్లో ముడా అనుమతులు లేకుండా లేఅవుట్లు తయారు చేసి అమ్ముతున్నారని అదే గ్రామ పంచాయతీ కార్యదర్శి గోపి నెల రోజుల క్రితం గ్రామ పంచాయతీ నుంచి నోటీసు బోర్డును ఏర్పాటు చేశారు. ఆ బోర్డును లేవుట్లు తయారు చేస్తున్న యజమాని తొలగించారన ఆయన ఆదివారం పోలీసులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా భూత్పూర్ పోలీసులు గ్రామ పంచాయతీ నోటీసు బోర్డును తొలగించిన ప్రదేశాన్ని పరిశీలించారు. విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

ఆశాజనకంగా రబీ ఆముదం

- పెట్టుబడి ఖర్చు తక్కువ
- రైతులకు లాభదాయకం



వెంకటేశ్వరబావి గ్రామంలో సాగు చేసిన ఆముదం పంట

అమ్రాబాద్, ఏప్రిల్ 7 : రబీ సీజన్లో రైతులకు సాగు చేసిన ఆముదం పంట ఆశాజనకంగా ఉంది. అమ్రాబాద్ మండలంలోని జంగం రెడ్డిపల్లి, వెంకటేశ్వర బావి, మన్ననూర్, అమ్రాబాద్, ఈదులబావి, కుమ్మరోనిపల్లి, మాధవానిపల్లి తదితర గ్రామాల్లో రైతులు సుమారు 100 ఎకరాల్లో ఆముదం పంటను సాగు చేశారు. ఈ పంటకు నీరు కూడా తక్కువగానే పడుతుంది. దీంతో పాటు ఈ పంట సాగుకు పెట్టుబడి ఖర్చులు ఎకరానికి 15 వేల నుంచి 20 వేల రూపాయల వరకు అవుతుంది. పంట దిగుబడి ఒక ఎకరానికి ఎనిమిది క్వింటాళ్ల నుంచి పది క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని ఆయా గ్రా మాల రైతులు తెలిపారు. ఆముదం పంటకు జడ్చర్ల వ్య వసాయ మార్కెట్లో 6 వేల వరకు ధర పలుకుతోంది. దీ ని ద్వారా మొత్తం ఖర్చులు పోను 30 వేల రూపాయల వరకు ఆదాయం రానుందని వారు తెలిపారు. ఈ ప్రాంతంలో పత్తి, మిరప తదితర వాణిజ్య పంటలు రాకముందు ఆముదం పంటనే ప్రధానంగా రైతులు సాగు చేసేవారు. ప్రస్తుతం మార్కెట్ రేటు కొంత గిట్టుబాటుగా ఉండటం తో రైతులు ఈ పంటవైపు ఆసక్తి చూపుతు న్నారు.

ఐదేళ్లులుగా ఆముదం పంట వేస్తున్నా..



గత ఐదేళ్లగా ఆముదం పంటను రబీ సీజన్‌లో వరుసగా సాగు చేస్తూ వస్తున్నా. పాలెం రాజేంద్రనగర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తల సలహా ప్రకారం నాణ్యమైన పంట ఆముదం మంచి దిగుబడిని సాధిస్తున్నట్లు తెలిసి ఈ సీజన్‌లో వేరుశనగ పంటకు బదులు ఆముదం పంటను సాగు చేశా. ప్రస్తుతం మార్కెట్ రేటు రూ.ఆరు వేలు మాత్రమే ఉంది. ఈ పంటకు సుమారు రూ.10 వేల వరకు మద్దతు ధర ప్రభుత్వం ప్రకటిస్తే బాగుంటుంది.

- విఠల్‌రెడ్డి, రైతు, వెంకటేశ్వరబావి గ్రామం

భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

- జై భీం దీక్ష సమితి వ్యవస్థాపకుడు వంకేశ్వరం నిరంజన్
- 'భారత రాజ్యాంగం- ఒక విశ్లేషణ' పుస్కకావిష్కరణ



నాగర్‌కర్నూల్‌లో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పూలే, అంబేద్కర్ అధ్యాయన వేదిక, సమతా కల్చరల్ సొసైటీ సభ్యులు

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 7: అగ్రవర్ణ కులాలు మార్చాలని చూస్తున్న భారత రాజ్యాంగాన్ని దేశంలోని దళిత, బహుజనులంతా ఏకమై కాపాడుకుందామని జై భీం దీక్ష సమితి వ్యవస్థాపకుడు వంకేశ్వరం నిరంజన్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్‌రాం భవన్‌లో పూలే అంబేద్కర్ అధ్యాయన వేదిక, సమతా కల్చరల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో దొండి లక్ష్మీనారాయణ రచించిన "భారత రాజ్యాంగం-ఒక విశ్లేషణ" పుస్తకాన్ని జై భీం దీక్ష సమితి వ్యవస్థాపకుడు వంకేశ్వరం నిరంజన్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత దొడ్డి కొమరయ్య మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో పొందుపరిచిన సామ్యవాదం ఇప్పటికీ నెరవేర్చలేదన్నారు. దానికి న్యాయం చేయాలంటే ఆర్థిక అసమానతలు లేని సమాజాన్ని నిర్మించాలని, అప్పుడే సామ్యవాదానికి అర్థం చేకూరుతుందని పేర్కొన్నారు. వంకేశ్వరం నిరంజన్ మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని కాపాడుకోలేకపోతే దళిత బహుజనులు తమ హక్కులు కోల్పోయి బానిసత్వంలోని నెట్టివేయబడతారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోని బహుజనులంతా రాజ్యాంగాన్ని కాపాడే శక్తుల పక్షాన నడబడాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో పూలే అంబేద్కర్ అధ్యాయన వేదిక అధ్యక్షుడు గుడిపల్లి నిరంజన్, దళిత బహుజన ఉద్యోగ, ప్రజా సంఘాల నాయకులు వార్డెన్ చెన్నయ్య, జానయ్య, పరుశురాం, విష్ణుమూర్తి, బంగారయ్య, రాంచందర్, కాశీదాస్, విజయకాంత్, పెబ్బేటి మల్లికార్జున్, భాస్కర్, చందర్, వెంకటయ్య, లక్ష్మణ్‌నాయక్, ఖాజా, కాశన్న, శ్రావణ్, శివ తదితరులు పాల్గొన్నారు.

మక్తల్ ప్రాంతానికి ఏం అభివృద్ధి చేశారో చెప్పాలి

- కాంగ్రెస్ మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి



అమరచింత సభలో మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

అమరచింత, ఏప్రిల్ 7 : గతంలో ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా వెళ్లిన బీజేపీ అభ్యర్థి మక్తల్ ప్రాంతానికి ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం సాయంత్రం అమరచింతలో కాంగ్రెస్ విస్తృత స్థాయి కార్యకర్తల సదస్సులో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, పీసీసీ కల్లుగీత డిపార్ట్‌మెంట్ ఛైర్మన్ కేశం నాగరాజు గౌడ్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికలు బంగ్లా అహంకారానికి, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య జరుగుతున్న యుద్ధం లాంటి ఎన్నికలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం జూరాల ప్రాజెక్టు, చంద్రగడ్‌కోటను ఇప్పటివరకు ఎందుకు పర్యాటక ప్రాంతం చేయలేదన్నారు. మక్తల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయని ఆమె మక్తల్ ప్రజలు నావైపు ఉన్నారని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని వంశీచంద్‌రెడ్డి అన్నారు. సొంత వ్యాపారాలపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై ఎక్కడ పెట్టారని ఆయన ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం మక్తల్ నియోజకవర్గాన్ని, ఈ ప్రాంత అభివృద్ధిని పూర్తిస్థాయిలో చేసి చూపిస్తామని ఆయన అన్నారు. నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాల్లో చెక్‌డ్యాములు నిర్మించి ప్రతీ ఎకరాకు సాగునీరు అందించే బాధ్యతను తీసుకుంటామని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హామీ ఇచ్చారు. అనంతరం ఆయా గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నాగరాజుగౌడ్, బాలకృష్ణారెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, రవికుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, అయూబ్‌ఖాన్, మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

11 వరకు అటవీ చెక్‌పోస్టు నిబంధనల సడలింపు

- శ్రీశైలంలో ఉగాది ఉత్సవాల నేపథ్యంలో 24గంటలు వాహనాల అనుమతి



మన్ననూరులోని దుర్వాసుల చెరువు చెక్‌పోస్టు

మన్ననూర్, ఏప్రిల్ 7: శ్రీశైలంలో ఉగాది సందర్భంగా జరిగే ఉత్సవాలను పురస్కరించుకొని వేలాదిగా తరలివెళ్తున్న కర్ణాటక భక్తుల విన్నపం మేరకు అమ్రాబాద్ మండలంలోని మన్ననూరు, దోమలపెంట చెక్‌పోస్టుల వద్ద ఈ నెల 11 వరకు అటవీ నిబంధనలను సడలించినట్లు అమ్రాబాద్ రేంజ్ అధికారి ఆదిత్య తెలిపారు. శ్రీశైలంలో జరిగే భ్రమరాంబ అమ్మవారి పూర్ణకుంభ ఉత్సవాలలో పాల్గొనేందుకు కర్ణాటక రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి కన్నడ ప్రజలు వేలాదిగా శ్రీశైలం తరలివెళుతున్న నేపథ్యంలో వారి విన్నపం మేరకు రాష్ట్ర వైల్డ్‌లైఫ్ ఉన్నతాధికారుల నుంచి ఇది వరకే 6వ తేదీ నుంచి 11 మన్ననూరు, దోమలపెంట చెక్‌పోస్టుల వద్ద 24గంటల పాటుగా వాహనాలను అనుమతించనున్నట్లు ఆదేశాలు వచ్చాయన్నారు. రాత్రి 9 నుంచి ఉదయం 6 గంటల వరకు వాహనాలను అనుమతిస్తున్నప్పటికీ ఒకేసారి కాకుండా కొన్ని వాహనాలను కలిపి వదిలేలా చెక్‌పోస్టు సిబ్బందికి సూచనలిచ్చామన్నారు. అనుమతులు ఉన్నప్పటికీ అడవిలో ఎక్కడా వాహనాలు ఆపరాదని, సిగరేట్‌లు, బీడీలు కాల్చి రహదారులపై పడేయరాదని భక్తులను కోరారు. 24గంటల పాటు అటవీ పెట్రోలింగ్ బృందం ప్రత్యేక వాహనాల్లో తనిఖీలు నిర్వహిస్తారని , నిబంధనలను అతిక్రమించే వారిపై అటవీ శాఖ చర్యలు తీసుకుంటుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గండీడ్, ఏప్రిల్ 7 : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని సల్కర్‌పేట్ సబ్‌స్టేషన్ దగ్గర చోటు చేసు కుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... సల్కర్‌పేట్ గ్రామానికి చెందిన శివకుమార్ అనే వ్యక్తి సల్కర్‌పేట్ గ్రామం నుంచి గండీడ్ వైపు బైక్‌పై వెళ్తున్నాడు. సబ్‌స్టేషన్ సమీపాన బైక్ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొట్టడంతో కుడి కాలు విరిగింది. 108 వాహనానికి సమాచారం అందడంతో వారు జిల్లా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తర లించారు. అలాగే జానంపల్లి గ్రామ శివారులోని కట్టెల మిషన్ దగ్గర నం చర్ల గ్రామానికి చెందిన విశాల్, కళ్యాన్‌లు ఆటోలో కోస్గి వెళ్తుండగా కోస్గి నుంచి వస్తున్న కారు ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. 108 వాహనంలో కోస్గి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు.

శేరి సందు స్థలం గొడవపై కేసు నమోదు

గండీడ్, ఏప్రిల్ 7 : ఇళ్ల మధ్య శేరి సందు కోసం జరిగిన గొడవలో ఓ వ్యక్తిపై కేసు నమోదైన సంఘటన మండల పరిధిలోని పెద్దవార్వల్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవార్వల్ గ్రామంలో నారాయణ, కె. లక్ష్మయ్య ఇళ్లు పక్క పక్కన ఉంటాయి. ఇళ్ల మధ్య శేరి సందు విషయంలో గత నెలలో గొడవ జరిగి లక్ష్మయ్యను కొట్టినందుకు నారాయణపై జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రాయిపాకులలో గడ్డివామి దగ్ధం

తెలకపల్లి, ఏప్రిల్ 7 : నాగర్‌కర్నూల్‌జిల్లా తెలకపల్లి మండలంలోని గట్టురాయిపాకుల గ్రామానికి చెందిన సుగూరు శ్రీనుకు చెందిన గడ్డివాములు ఆదివారం ప్రమాద వశాత్తు దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాప క అధికారులు చేరుకుని మంటలు ఆర్పారు. కానీ అప్పటికే వాములు పూర్తిగా కాలిపోయాయి. దాదాపు 5ఎద్దుల బండ్ల గడ్డివాము ఉందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాడు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి

- యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి



కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న శివసేనారెడ్డి

బాలానగర్, ఏప్రిల్ 7 : కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ప్రజలకు వివరించి, వచ్చే ఎంపీ ఎన్నికల్లో అభ్యర్థి గెలుపునకు అందరూ కృషి చేయాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాజాపూర్ మండల సమీపంలోని షాగార్డెన్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రజల వద్దకు తీసుకెళ్లి ప్రతీ ఒక్కరికి అవగాహన కల్పించాలని సూచించారు. అంతేకాకుండా ఉమ్మడి మండలాల్లో ప్రతీ గ్రామంలో యువజన కాంగ్రెస్ కమిటీలు ఉన్నాయని, కేవలం పదుల సంఖ్యలో మాత్రమే నాయకులు హాజరు కావడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. యువజన కాంగ్రెస్ నాయకులు తమ పద్ధతి మార్చుకొని ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు.

వాహనాల తనిఖీలో రూ, 57 వేలు సీజ్

అమ్రాబాద్, ఏప్రిల్ 7: నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండల కేంద్రం సమీపంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన వాహనాల తనిఖీలలో 57 వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు పదర ఎస్‌ఐ రాజు విలేకరులకు తెలిపారు. అచ్చంపేట మండలం లింగోటం గ్రామానికి చెందిన నాయిని బాలయ్య వద్ద నుంచి డబ్బులను పట్టుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. బాలయ్య దగ్గర ఈ డబ్బులకు సంబంధించి రసీదులు లేకపోవడంతో ఎన్నికల నిబంధనలో భాగంగా సీజ్ చేశామని వివరించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



ఇసుకతో పట్టుబడిన ట్రాక్టర్

మానవపాడు/ఎర్రవల్లి, ఏప్రిల్ 7: జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండల కేంద్రంలోని తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పట్టుకున్నారు. ఎస్సై చంద్రకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని కొర్విపాడు గ్రామ శివారు ప్రాంతంలో తెల్లవారుజామున దాడులు నిర్వహించి పట్టుకున్నట్లు తెలిపారు. ఇసుక ట్రాక్టర్ కర్నూలు జిల్లా ఎదురూరు గ్రామానికి చెందిన హరిబాబుగా గుర్తించామన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలించినందుకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అలాగే ఎర్రవల్లి మండల పరిధిలోని యాక్తాపురం గ్రామ సమీపంలో ఆదివారం తెల్లవారుజామున ఇసుక టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఇటిక్యాల ఎస్సై వెంకటేష్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు ఇసుక టిప్పర్‌తో పాటు ట్రాక్టర్ పట్టుకున్నామన్నారు. విచారణ చేయగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు తేలడంతో కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

కర్ణాటక మద్యం పట్టివేత



బల్గెర చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన నిందితుడు

గట్టు, ఏప్రిల్ 7: కర్ణాటక నుంచి అక్రమంగా మద్యాన్ని తెలంగాణలోకి తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ ఆదివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటకకు చెందిన రంగన్న అనే వ్యక్తి ఆటోలో మద్యాన్ని తరలిస్తున్నట్లు తమకు సమాచారం అందడంతో బల్గెర చెక్‌పోస్టు వద్ద నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఆటో చెక్‌పోస్టు సమీపంలోకి రాగానే తనిఖీ చేయగా 129.6 లీటర్ల మద్యం ఉన్నట్లు గుర్తించామన్నా రు. ఆటో, మద్యాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

టాస్క్ ఫోర్స్ దాడుల్లో మద్యం పట్టివేత

నారాయణపేట రూరల్, ఏప్రిల్ 7 : టాస్క్ ఫోర్స్ దాడుల్లో మద్యం పట్టుబడింది. ఈ సంఘటన నారాయణపేట జిల్లా బొమ్మన్‌పాడు గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో భాగంగా పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో బొమ్మన్‌పాడ్ గ్రామానికి చెందిన కాశప్ప అనే వ్యక్తి అక్రమంగా తరలిస్తున్న 17.4 లీటర్ల మద్యంను టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం పేట శివారులో పట్టుకున్నారు. వాటి విలువ రూ.5,800 ఉంటుందని, మద్యం పట్టుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించడం జరిగిందన్నారు. ఎస్‌ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కాశప్పపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. విలువైన వస్తువులు, మద్యం, నగదు కోడ్‌లో తీసుకువెళ్లరాదన్నారు. తగు పత్రాలు కలిగి ఉండాలని లేకుంటే సీజ్ చేయడం జరుగుతుందన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

ఉండవల్లి, ఏప్రిల్ 7: మండల పరిధిలోని కంచుపాడు గ్రామానికి చెందిన పాముల ఆంజనేయులు అదే గ్రామానికి చెందిన విక్రమాచార్య అనే వ్యక్తిపై గత నెల 23న ఉండవల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అందులో భాగంగా ఆదివారం డీఎస్పీ సత్యనారాయణ కంచుపాడు గ్రామంలో విచారణ చేపట్టారు. వివాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. మండలంలోని గ్రామాల వారిగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సమయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వీరి వెంట ఎస్‌ఐ శ్రీనివాసులు నాయక్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అలంపూర్ చౌరస్తా, ఏప్రిల్ 7: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఉండవల్లి ఏఎస్సై సుబ్బారెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళ్తే కడప జిల్లా బద్వేలుకు చెందిన కళ్యాణ్‌రామ్ అనే యువకుడు ప్రేమవివాహం చేసుకుని భార్య షేక్ షబీన్‌భాను, అయిదేళ్ల కూతురుతో కలిసి కర్నూలులో నివాసం ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవనం కొనసాగించేవాడు. ఈ నెల 3న బయటకు వెళ్లొస్తానని చెప్పి వచ్చిన కళ్యాణ్‌రామ్ ఉండవల్లి మండలం, పుల్లూరు గ్రామ శివారులో, జాతీయ రహదారిపై కిందపడి గాయపడ్డాడు. కర్నూలు జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 6న మృతి చెందాడు. ఆదివారం భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పెద్దవార్వల్ గ్రామంలో..

గండీడ్, : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పెద్దవార్వల్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిన్నవార్వల్ గ్రామానికి చెందిన ఎస్.వెంకటయ్య(43) అనే వ్యక్తి పెద్దవార్వల్ గ్రామం నుంచి చిన్నవార్వల్ గ్రామానికి తన బైక్‌పై వస్తుండగా అదుపుతప్పి కిందపడ్డాడు. గాయాలు కావడంతో గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బీఆర్‌ఎస్ నుంచి నలుగురు కౌన్సిలర్ల సస్పెన్షన్

వనపర్తి అర్బన్, ఏప్రిల్ 7 : పార్టీ క్రమశిక్షణ నిబంధనలు ఉల్లంఘించిన బీఆర్‌ఎస్‌కు చెందిన నలుగురు కౌన్సిలర్లను సస్పెన్షన్ చేస్తున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు పలుస రమేష్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆదేశాల మేరకు వనపర్తి మునిసిపాలిటీకి చెందిన 28వ వార్డు కౌన్సిలర్ మంజులగోపాల్, 12వ వార్డుకు చెందిన అలివేలగోపాల్, ఐదో వార్డుకు చెందిన మేఘావత్ శాంతి రమేష్‌నాయక్, 27వ వార్డుకు చెందిన లక్ష్మీదేవమ్మలను పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘన కింద సస్పెన్షన్ చేసినట్లు తెలిపారు. శనివారం వనపర్తి జిల్లా కేంద్రంలో జరిగిన మునిసిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతు తెలిపినందుకు గాను నలుగురు కౌన్సిలర్లను బీఆర్‌ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేశారు.

సంచార జాతుల వృద్ధులకు రెడ్‌క్రాస్ వైద్య సేవలు


సంచార వృద్ధులకు మందులు అందజేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

కందనూలు, ఏప్రిల్ 7 : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నాగర్‌కర్నూల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా నాగర్‌కర్నూల్ పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్ వెనకాల ప్రాంతంలో ఉన్న సంచార జాతుల వృద్ధులకు వైద్య సేవలందించినట్లు జిల్లా సెక్రటరీ రమేష్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంచార జాతుల వారందరికీ మధుమేహం, బీపీ పరీక్షలు నిర్వహించామన్నారు. అనంతరం సంచార జాతుల వృద్ధులకు హైపర్ టెన్షన్, డయాబెటిక్ మందులు, మల్టీ విటమిన్, కాల్షియం టానికులు, కంటి చుక్కల మందులు అందించడంతో పాటు ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. రెడ్‌క్రాస్ వైస్ ఛైర్మన్ శ్రీధర్, జిల్లా యూత్ రెడ్‌క్రాస్ జిల్లా కన్వీనర్ కుమార్, అనురాధ, వలంటీర్ మేఘా వర్షిణి తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

కందనూలు, ఏప్రిల్ 7 : నాగర్‌కర్నూల్‌లోని జ్ఞాన సరస్వతి దేవాలయ ప్రాంగణంలోని జ్ఞానేశ్వర అరక్షిత బాలుర ఆశ్రమంలో ఆదివారం కంచర్ల విక్రాంత్ ఆనంద్ పుట్టిన వేడుక జరిగింది. ఉగాది పర్వదినం సందర్భంగా అరక్షిత బాలలకు సాంప్రదాయ దుస్తులను జ్ఞాన సరస్వతి వికాస భారతి సంస్థ ఆధ్వర్యంలో అచ్చంపేటకు చెందిన కంచర్ల ఆనంద్, విక్రాంత్‌లు 15మంది అనాథ బాలలకు సాంప్రదాయ దుస్తులు పంపిణీ చేశారు. అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ తెలుగు పండుగలను సాంప్రదాయ దుస్తుల్లో చేసుకోవడం ప్రారంభించాలని సూచించారు. జ్ఞాన వికాస భారతి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మచారి, అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు సోమ ప్రగతి గౌడ్, ప్రధాన కార్యదర్శి సుధారాణి, ప్రచార కార్యదర్శి సురేందర్, జ్ఞానేశ్వర్, ఆశ్రమ ట్రస్టు కన్వీనర్ ఆకారపు విశ్వనాథం, ఆశ్రమ నిర్వాహకులు దొడ్ల నారాయణరెడ్డి, జ్ఞాన వికాస భారతి సభ్యులు, ఆశ్రమ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

వెల్దండ, ఏప్రిల్ 7 : అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీఆర్‌టీయు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తొండలపల్లి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను వెంటనే విడుదల చేయాలని కోరారు. టెట్‌తో ప్రమేయం లేకుండా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని పేర్కొన్నారు. ఆగిపోయిన బదిలీలను వెంటనే చేపట్టాలని కోరారు. 317 జీవోతో నష్టపోయిన ఉపాధ్యాయులకు తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం లోగా పాఠశాలల్లో స్వీపర్లను నియమించాలన్నారు. ఎన్నో ఏళ్లుగా ఖాళీగా ఉన్న ఎంఈవో, ఉపాధ్యాయుల భర్తీని వెంటనే చేపట్టి ప్రభుత్వ పాఠశాలల పటిష్టతకు ప్రభుత్వం కృషి చేయాలని వెంకట్‌రెడ్డి కోరారు.

ఫొటో, వీడియో గ్రాఫర్స్ కుటుంబాలను ఆదుకోవాలి

- రాష్ట్ర నాయకుడు కట్ట శ్రీనివాసులు

కొల్లాపూర్, ఏప్రిల్ 7 : ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఫొటో, వీడియోగ్రాఫర్ల పాత్ర ఎంతో కీలక భూమిక పోషించిందని, ప్రపంచానికి తెలంగాణలో జరుగుతున్న అన్యాయాలను కళ్లకు కట్టినట్లు చూపించామని ఫొటో వీడియో గ్రాఫర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు కట్ట శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం కొల్లాపూర్ పట్టణంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సెల్‌ఫోన్ల నూతన టెక్నాలజీ వల్ల ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు ఆర్థికంగా చితికిపోయారని, వారి జీవనోపాధి భారంగా మారిందన్నారు. ప్రభుత్వం ఫొటో, వీడియోగ్రాఫర్ల కష్టాలు గుర్తించి వారికి 90శాతం సబ్సిడీలో బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని తద్వారా నిరుద్యోగ ఫొటో, వీడియో గ్రాఫర్ల కుటుంబాలను పోషించుకుంటారని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది ఫొటోగ్రాఫర్లు ఉపాధి లేక వీధిన పడే పరిస్థితి నెలకొందని, వీరందరినీ ప్రభుత్వమే ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. 55సంవత్సరాలు దాటిన సీనియర్ ఫొటోగ్రాఫర్లందరికీ ప్రభుత్వపరంగా పింఛన్ మంజూరు చేయాలని. ఆదేవిధంగా ఫొటో, వీడియో గ్రాఫర్ కుటుంబాలకు ప్రభుత్వం ఇంటి స్థలంతో పాటు డబుల్ బెడ్రూంలు కేటాయించాలని, ప్రతి మండల కేంద్రంలో ఫొటో, వీడియో గ్రాఫర్ల కోసం ఒక కమ్యూనిటీ హాల్ నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఆర్ఎస్‌పీ గెలుపు కోసం కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, హాజరైన బీఆర్ఎస్ సోషల్ మీడియా సభ్యులు

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 7: రేబోయే ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ గెలపు కోసం కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ యువజన, సోషల్ మీడియా ప్రతినిధులతో అయన సమావేశం నిర్వహించి పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో ప్రశ్నించే గొంతుక ఆర్ఎస్‌పీని గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధి, ప్రజల ఆకాంక్షలను గళం వినిపిస్తారన్నారు. సోషల్ మీడియాలో కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్‌పై తప్పుడు వార్తలతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ యువత సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్, బీజేపీల తప్పుడు నిర్ణయాలను ప్రజలకు వివరించాలన్నారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే జనంపల్లి


ఊర్కొండలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డిని సన్మానిస్తున్న ముస్లిం పెద్దలు

ఊర్కొండ, ఏప్రిల్ 7: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు వంగ సంతోష్‌రెడ్డి స్వగృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ముస్లిం పెద్దలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యావ నిఖిల్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు తిరుపతి రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి రమేష్‌నాయక్, డీసీసీ అధికార ప్రతినిధి వీరాస్వామి, మైనారిటీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సమి, మండల కాంగ్రెస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు కంఠం విజయుడు, నాయకులు తలసాని అనిల్‌రెడ్డి గోపినాయక్, సత్యనారాయణరెడ్డి, కృష్ణయ్య, శ్రీనివాసులు, మల్లేష్, అరిఫ్, రఫిక్, గణేష్, షబ్బీర్, సయ్యద్ షర్ఫోద్దిన్, మహ్మద్ ఖాజ, అయూబ్‌పాష, యాదయ్య, సంగప్పగౌడ్, ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

ఇఫ్తార్ విందు ఇచ్చిన ఎంపీపీ

పెద్దకొత్తపల్లి: పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలకు ఆదివారం సాయంత్రం ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ ఇఫ్తార్ విందు ఇచ్చారు. పెద్దకొత్తపల్లిలోని వాసవీ ఫంక్షన్ హాల్‌లో ముస్లింలతో కలిసి ఆయన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అంతకుముందు మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సింగిల్ విండో ఛైర్మన్ శ్రీనివాస్‌యాదవ్, మాజీ సర్పంచ్‌లు వి.సత్యం, పి.చిన్నయ్య, రాంలాల్, జిల్లా గ్రంథాలయ సంస్థమాజీ ఛైర్మన్ నాగపూర్ విష్ణు, ఎంపీటీసీ సభ్యులు రవికుమార్, ప్రతాప్‌రెడ్డి, నాయకులు మేకల చంద్రయ్య, బాలింగాచారి, ఎదిరేపల్లి కాశన్న, శ్రీనివాస్‌రెడ్డి, రాంప్రసాద్, జే.కురుమూర్తి, మిద్దె చంద్రయ్య, బొల్లె విష్ణు, వి.శ్రీనివాసులు, మల్లయ్య, ముస్లింలు షాలేమియా, సుల్తాన్, బాబు బషీరుద్దీన్, మైను, హుసేన్, గులాంరసూల్, బాబా, ఖాజా, ఫరీద్, బాలపీరు తదితరులు పాల్గొన్నారు.

గ్రాసం కరువై బక్క చిక్కుతున్న పశువులు

- మూగజీవాల కడుపు నింపేందుకు రైతుల అవస్థలు

● నీటి కోసం అల్లాడుతున్న మూగజీవాలు

● ఇతర ప్రాంతాల నుంచి పశుగ్రాసం కొనుగోలు చేస్తున్న రైతులు

● ట్రాక్టర్ గడ్డి ధర రూ. 10 వేల నుంచి రూ. 15 వేలు

● తగ్గుతున్న పాల దిగుబడి

చారకొండ, ఏప్రిల్ 7: పశుగ్రాసం కరువై మూగజీవాలు అల్లాడుతున్నాయి. 2019 పశుగణన ప్రకారం చారకొండ మండలంలో దాదాపుగా 20 వేలకు పైగా పశువులు, మేకలు, గొర్రెలు ఉన్నట్లు మండల పశువైద్యాధికారులు చెప్తున్నారు. ఈ ప్రాంతంలో దాదాపుగా నాలుగేళ్లుగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పొలాల్లో పచ్చిక కనిపించటం లేదు. పంటలు సరిగా పండక గ్రాసం కూడా కరువైంది. ఇతర ప్రాంతాల నుంచి రైతులు వేల రూపాయలు ఖర్చు చేసి పశుగ్రాసాన్ని తెచ్చుకొంటున్నారు. మండల కేంద్రంలోని పశువుల ఆసుపత్రిలో 2023 డిసెంబరులో రైతులకు గడ్డి విత్తనాలు సరఫరా చేయాల్సి ఉండగా సరఫరా చేయలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● రెట్టింపయిన పశుగ్రాసం ధర

పశువులే జీవనాధారంగా జీవిస్తున్న ఎన్నో కుటుంబాలు ప్రస్తుత పరిస్థితుల్లో దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. స్థానికంగా పశువులకు మేత కరువవడంతో రైతులు ఇతర ప్రాంతాల నుంచి పశుగ్రాసాన్ని కొనుగోలు చేస్తున్నారు. మండలంలోని రైతులు నల్గొండ జిల్లా మల్లేపల్లి, హలియా, మిర్యాలగూడ తదితర ప్రాంతాల నుంచి వరిగడ్డి కొనుగోలు చేస్తున్నారు. ట్రాక్టర్ గడ్డి రూ. 10 వేల నుంచి రూ. 15 వేల వరకు వెచ్చించి తెచ్చుకుంటున్నారు. దీనికి రవాణా ఖర్చులు రెండు నుంచి మూడు వేల వరకు అవుతుందని రైతులు చెప్తున్నారు. ఆర్థిక స్థోమత లేని రైతులు ఆయా పట్టణాల్లో జరిగే సంతల్లో పశువులను విక్రయిస్తున్నారు. కరువు పరిస్థితుల వల్ల సరైన ధర కూడా దక్కడం లేదని తక్కువ ధరలకే అమ్ముకుంటున్నామని రైతులు వాపోతున్నారు. రోజురోజుకు అంతరించి పోతున్న భూగర్భ జలాలతో మూగజీవాలకు గుక్కెడు నీరు దొరకని పరిస్థితి ఏర్పడింది. రైతులు సుదూర ప్రాంతాల నుంచి పశువులకు నీటిని తీసుకొచ్చి తాగిస్తున్నారు. ఒకపక్క పశుగ్రాసం, మరోపక్క మంచినీరు లేక పడరాని పాట్లు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి గ్రామాల్లో పశుగ్రాసం కేంద్రాలను ఏర్పాటు చేసి చేయూత ఇవ్వాలని పలువురు రైతులు కోరుతున్నారు. ఆదేవిధంగా దాణాను ఉచితంగా అందించాలని పాడి రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. లేకపోతే తాము ఉపాధి కోల్పోవస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● పశుగ్రాసం కొరత ఉంది

మండలంలో పశుగ్రాసం కొరత ఎక్కువగానే ఉంది. మండలం మొత్తం దాదాపుగా ఎనిమిది టన్నుల కొరత ఉన్నట్లు గుర్తించాం. ప్రస్తుతం రైతుల వద్ద కొంత మేర పశుగ్రాసం ఉంది. 2023 డిసెంబరులో ప్రభుత్వం నుంచి గడ్డి విత్తనాలు రావాల్సి ఉండగా రాలేదు. విత్తనాలు సరఫరా చేసి ఉంటే పాడి రైతులు, నీటి వసతి ఉన్న రైతుల వద్ద కొంత మేర పశుగ్రాసం ఉండేది. పశుగ్రాసం కొరత విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

- డాక్టర్ శివకుమార్ మండల పశువైద్యాధికారి


గడ్డి కోసం ఆరాటపడుతున్న పశువులు

● పశుగ్రాసం కేంద్రాలు ఏర్పాటు చేయాలి



వేసవి కాలం కావడంతో గడ్డి కరువైంది. దీంతో మూగజీవాలకు మేత దొరకకపోవడంతో అల్లాడుతున్నాయి. దీంతో పశువుల ఆకలి తీర్చలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పశువుల ఆసుపత్రి నుంచి రైతులకు గడ్డి విత్తనాలను సరఫరా చేసివుంటే కొంత మేర పశుగ్రాసం కొరత ఉండేది కాదు. ప్రభుత్వం స్పందించి అన్ని గ్రామాల్లో ఉచితంగా పశుగ్రాసం కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి.

- చీమర్ల నరేందర్‌రెడ్డి, పాడిరైతు, చారకొండ

● పశుగ్రాసం కొరత తీవ్రంగా ఉంది



ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది పశుగ్రాసం కొరత తీవ్రంగా ఉంది. నాకు 10 పాడి గేదెలున్నాయి. వాటి కడుపు నింపేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. నల్గొండ జిల్లా నుంచి ట్రాక్టర్ గడ్డిని రూ. 10 వేల నుంచి రూ. 15 వేల వరకు చెల్లించి దిగుమతి చేసుకుంటున్నాం. పెరిగిన ధరలతో పాడిపరిశ్రమ నిర్వహణ భారంగా మారింది. పాడి రైతులకు ప్రభుత్వం చేయూతనివ్వాలి.

- కుంబం కొండలయ్యగౌడ్, పాడిరైతు, చారకొండ

ఎస్సీ వర్గీకరణలో బీజేపీ పాత్ర శూన్యం

- మందకృష్ణ మాదిగ బీజేపీ కండువా వేసుకో

- బహుజనుల ఆత్మగౌరవాన్ని దొరల వద్ద తాకట్టు పెట్టిన ఆర్ఎస్‌పీ

- పిలుస్తే పలికే మల్లు రవిని గెలిపిద్దాం

- విలేకరుల సమావేశంలో తెలంగాణ మాదిగ దండోరా అధ్యక్షుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేవని సతీష్ మాదిగ

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 7: మూడు దశాబ్దాలు కొనసాగుతున్న ఎస్సీ వర్గీకరణ అంశంలో పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ పాత్ర శూన్యమని తెలంగాణ మాదిగ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేవని సతీష్ మాదిగ అన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి నివాసంలో సతీష్‌మాదిగ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమని చెబుతున్న ఎమ్మార్పీఎస్ నేత మందకృష్ణ మాదిగ బీజేపీ అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో ఏం చేసిందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణను 2004 సుప్రీంకోర్టు కొట్టివేసే నాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఉషా మెహరా కమిషన్ వేసిందని పేర్కొన్నారు. అంతే కాకుండా మాదిగలకు న్యాయం జరగాలని సుప్రీంకోర్టులో న్యాయవాదులను పెట్టి కాంగ్రెస్ పార్టీ ఎస్సీ వర్గీకరణ కోసం వాదించిందని,


నాగర్‌కర్నూల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీఎండీ అధ్యక్షుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేవని సతీష్ మాదిగ

సుప్రీంకోర్టు రిజర్వులో ఉన్న తీర్పుకు కూడా కాంగ్రెస్ వేసిన ఉషా మెహరా కమిషనే సాక్ష్యమన్నారు. దళితులను చిన్న చూపు చూసే బీజేపీకి వత్తాసు పలుకుతున్న మందకృష్ణ మాదిగ తన మెడలో నల్ల కండువా తీసి బీజేపీ కండువా వేసుకుంటే బాగుండని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ కోసం బీజేపీలో చేరానని అబద్దాలు చెబుతున్న నాగర్‌కర్నూల్ ఎంపీ రాములు కేవలం తన కుమారుడి టికెట్ కోసమే బీజేపీలో చేరారని ఆరోపించారు. ఏకపక్ష నిర్ణయాలతో ఎన్నో చట్టాల ను తీసుకువచ్చిన బీజేపీ ప్రభుత్వం మాదిగలను కేవలం ఓటుబ్యాంకుగా వాడుకోవడం తప్పితే చిన్న అంశమైన వర్గీకరణ పట్ల చిత్తశుద్ధి లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ బహుజన వాదాన్ని దొరల కాళ్ల వద్ద తాకట్టు పెట్టారని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి తీసుకురావడంలో నాగర్‌కర్నూల్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి పాత్ర కీలకమన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంటులో వరుసగా ఐదు సార్లు గెలిచిన మాదిగలు ఒక్కసారి ఇతరులకు కూడా అవకాశం ఇద్దామని, పిలిస్తే పలికే మల్లు రవికి మాదిగలంతా ఓట్లేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. కౌన్సిలర్ కొత్త శ్రీనివాసులు, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు వంకేశ్వరం మణెమ్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ బహదూర్, వంకేశ్వరం లక్ష్మయ్య, రాంచందర్, మిద్దె మల్లేష్ పాల్గొన్నారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

- జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ సోలపోగుల స్వాములు

కల్వకుర్తి, ఏప్రిల్ 7 : క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం, శారీరక దారుఢ్యం చేకూరుతుందని జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ సోలపోగుల స్వాములు అన్నారు. క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆయన కోరారు. కల్వకుర్తి పట్టణంలోని సీబీఎం కళాశాల ఆవరణలో ఆదివారం జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మిడిల్, లాంగ్, డిస్టెన్స్ రన్నింగ్ రాష్ట్ర స్థాయి ఎంపికలు నిర్వహించారు. ఈ క్రీడలకు ఉమ్మడి జిల్లా పరిధిలోని 150మంది క్రీడాకారులు పాల్గొని అత్యంత ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు కార్యదర్శి స్వాములు సర్టిఫికెట్లను ప్రదానం చేశా రు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 28న సూర్యాపేట జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలు పొందిన క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. క్రీడల్లో రాణించిన వారికి విద్యా ఉద్యోగ అవకాశాల్లో సైతం రిజర్వేషన్ల సౌకర్యం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ యాదవ్, నాయకులు పరుశరాముడు, అంజయ్య, భిక్షప తి, శ్రీనుయాదవ్, శ్రీనివాస్, స్వేరోస్ నాయకులు భీమ య్య, మల్లేష్, సురాజ్, పీఈటీలు మల్లేష్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ సోలపోగుల స్వాములు

ప్రజా వ్యతిరేక కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించాలి

- సీపీఐ, సీపీఎం రాష్ట్ర నాయకులు ఎం.బాల్‌నర్సింహ, కిల్లె గోపాల్ పిలుపు

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 7: ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ, సీపీఎం రాష్ట్ర నాయకుడు కిల్లె గోపాల్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సింగిల్ కార్యాలయం సమావేశ మందిరంలో సీపీఐ, సీపీఎంల ఆధ్వర్యంలో బీజేపి ప్రజా ప్రతిరేక విధానాలపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్‌నర్సింహ మాట్లాడుతూ దేశంలో గత పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ఏనాడు పేద ప్రజల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోలేదని, కేవలం ఆర్ఎస్ఎస్ మనువాద ఎజెండానే అమలు చేస్తోందని ఆరోపించారు. దేశంలో కుల, మత, ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడుతూ పబ్బం గడుపుతోందన్నారు. మణిపూర్ మారణ హోమంపై ఇప్పటి వరకు స్పందించిన మోదీ అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వ రంగ సంస్థలను కట్టబెడుతూ దేశ సంపదను దచిపెడుతోందని విమర్శించారు. దేశంలో 400 సీట్లు గెలిస్తే భారత రాజ్యాంగాన్ని మారుస్తామన్న బీజేపీ నేతలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇలాంటి మతోన్మాద బీజేపీ తిరిగి అధికారంలోకి రాకుండా ప్రజాస్వామ్య వాదులు, మేధావులు, యువత ఏకమై అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. సీపీఎం రాష్ట్ర నాయకుడు కిల్లె గోపాల్ మాట్లాడుతూ దేశంలో బీజేపీయేతర రాష్ట్రాలు, ప్రతిపక్ష నేతలపై కేంద్ర ప్రభుత్వం ఈడీ, సీబీఐ వంటి సంస్థలను ఉపయోగించి దాడులకు పాల్పడుతోందని, ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించి ప్రజాస్వామ్యా న్ని భారత రాజ్యాంగాన్ని రక్షించేందుకు దేశ ప్రజలు సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు హెచ్.ఆనంద్‌జీ, కేశవులుగౌడ్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, నాయకులు ఆర్.శ్రీను, ఆంజనేయులు, చంద్రమౌళి, కృష్ణాజీ, లక్ష్మీపతి, శివశంకర్, రవీందర్, రామయ్య, అశోక్, ప్రేమ్‌కుమార్, కాశన్న పాల్గొన్నారు.


నాగర్‌కర్నూల్‌లో నిర్వహించిన సదస్సులో అభివాదం చేస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

రంజాన్ మాసం పవిత్రమైంది

- మౌలానా మహ్మద్ రెహమాన్ అన్సారి ఖాదిరి

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 7: రంజాన్ మాసం ముస్లింలకు ఎంతో పవిత్రమైనదని ఇస్లామిక్ ఆధ్యాత్మిక బోధకుడు మౌలానా మహ్మద్ రెహమాన్ అన్సారి ఖాదిరి అన్నారు. శనివారం రాత్రి జిల్లా కేంద్రంలోని జామియా మజీద్‌లో భక్తి శ్రద్ధలతో షబ్ ఏ ఖదర్ ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలానా మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఆధ్యాత్మిక సేవలో ఉన్న అల్లా ముస్లింలకు స్వర్గలోకం ప్రాప్తి కలిగే విధంగా సువర్ణ అవకాశాన్ని అల్లా కల్పిస్తాడని ఖురాన్‌లో చెప్పాడని పేర్కొన్నారు. నిష్టతో రోజు జకాత్, ఫిత్రా, నమాజ్ నిబంధనలు పాటిస్తే అల్లా అనుగ్రహం భక్తులకు ఉంటుందన్నారు. మజీద్ కమిటీ సభ్యులు, ముస్లిం మత పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


నాగర్‌కర్నూల్‌లోని జామియా మజీద్‌లో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

బాధిత కుటుంబానికి ఎంఎస్ఆర్ ట్రస్టు ఆర్థిక సహాయం

తిమ్మాజిపేట, ఏప్రిల్ 7 : తిమ్మాజిపేట మండలం చేగుంట గ్రామానికి చెందిన చిత్తనూరు సునీత అనారోగ్యంతో చనిపోవడంతో ఎంఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ మారేపల్లి సురేందర్‌రెడ్డి పదివేల ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. చేగుంట గ్రామ ప్రజలు ట్రస్టు సభ్యులు సునీతకు నాయకులు సురేందర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

జన జాతరతో ఇండియా కూటమి విజయానికి నాంది


కొల్లాపూర్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రంగినేని జగదీశ్వరుడు

కొల్లాపూర్, ఏప్రిల్ 7 : హైదరాబాద్ మహానగరంలో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొనసాగిన జన జాతర బహిరంగ సభ సక్సెస్‌తో దేశంలో రాబోయేది ఇండియా కూటమి ప్రభుత్వమేనని తేటతెల్లమైందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రంగినేని జగదీశ్వరుడు ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం కొల్లాపూర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకునమోని రాముయాదవ్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కంటె శివన్నతో కలిసి ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. జన జాతర సభలో కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకులు, ఎంపీ రాహుల్‌గాంధీ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోను ప్రకటించడం హర్షించదగ్గ విషయమన్నారు. జన జాతర సభకు లక్షలాదిగా కాంగ్రెస్ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు తరలి వచ్చారని, తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగబోయే ఎంపీ ఎన్నికల్లో 17స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులే గెలుపు జెండా ఎగురవేస్తారని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా వన మహోత్సవం


సహపంక్తి భోజనాలు చేస్తున్న గ్రామస్థులు

చారకొండ, ఏప్రిల్ 6: మండల పరిధిలోని చంద్రాయణపల్లిలో ఆదివారం గ్రామస్థులు వన మహోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేసి పాడిపంటలు, పశు సంపదను కాపాడాలని మొక్కుకున్నారు. కుటుంబ సమేతంగా వనానికి వెళ్లి వంటావార్పు చేసుకొని సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం గ్రామస్థులు ఆడి పాడారు. సాయంత్రం వేళ తిరిగి ఇంటికి వెళ్లారు.

కోరటికల్‌లో...

ఉప్పునుంతల: మండల పరిధిలోని కోరటికల్ గ్రామంలో ఆదివారం వన మహోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు గ్రామ సమీపంలోని చెట్ల కింది వెళ్లి ప్రత్యేకంగా చేసుకున్న వంటకాలను గ్రామ దేవతలకు నైవేద్యంగా సమర్పించారు. వంటకాలను బంధు మిత్రులతో కలిసి భోజనం చేశారు. ఆటపాటలతో సందడి చేశారు.

సామాజిక సేవలో భాగస్వాములు కావాలి


గోల్డెన్ స్టార్ క్లబ్ నాయకులను సన్మానిస్తున్న జూలూరి రమేష్‌బాబు

కల్వకుర్తి, ఏప్రిల్ 7: సామాజిక సేవలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు జూలూరి రమేష్‌బాబు కోరారు. వాసవీక్లబ్ సేవలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని ఆయన పేర్కొన్నారు. వాసవీక్లబ్ గోల్డెన్ స్టార్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి జూలూరి రమేష్‌బాబు హాజరై ప్రసంగించారు. సమాజంలో పేదలకు చేయూతగా ప్రతీ ఒక్కరు నిలవాలన్నారు. క్లబ్ సేవలను మరింత విస్తృతపర్చాలని ఆయన పిలుపునిచ్చారు. నాయకులు జూలూరి రఘు, కే.రమేష్, జే.రమేష్, విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

బాధితుడికి మిత్ర ఫౌండేషన్ ఆర్థిక సహాయం

కల్వకుర్తి, ఏప్రిల్ 7 : కల్వకుర్తి పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన హుస్సేన్ ప్రమాదవశాత్తు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మిత్ర ఫౌండేషన్ సభ్యులు బాధితునికి ఆదివారం ఆర్థిక సహాయం అందజేశారు. త్వరగా కోలుకోవాలని ఫౌండేషన్ సభ్యులు ఆకాంక్షించారు.

ప్రమాదాల నివారణకు బారికేడ్లు దోహదం

కల్వకుర్తి, ఏప్రిల్ 7 : రోడ్డు ప్రమాదాల నివారణకు బారికేడ్లు దోహదపడుతాయని కల్వకుర్తి ఎస్ఐ జి.మాధవరెడ్డి అన్నారు. వాహనచోదకులు ట్రాఫిక్ రూల్స్ విధిగా పాటించాలని ఆయన పేర్కొన్నారు. కల్వకుర్తి మండలం తాండ్ర గేటు సమీపంలో శ్రీశైలం హైదరాబాద్ ప్రధాన రహదారిపై ప్రమాదాలు జరుగుతుండడంతో ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి సూచన మేరకు ఆదివారం రోడ్డుపై బారికేడ్లను ఏర్పాటు చేశారు. నాయకులు సురేందర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఉప్పునుంతల, ఏప్రిల్ 7 : మండల పరిధిలోని ఈర్వటోనిపల్లి గ్రామంలో గత 10 రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన గుర్రం కృష్ణయ్య కుటుంబాన్ని ఆదివారం దశదినకర్మ సందర్భంగా కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మోపతయ్య పరామర్శించారు. ఈ సందర్భంగా మృతునికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన ధైర్యం ఇచ్చారు. ఆయన వెంట నాయకులు నిరంజన్, కాశన్న, రాములు, వెంకటయ్య, బక్కయ్య, తదితరులు ఉన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చిన పోలీసులు


పెంట్లవెల్లి నుంచి కొండూరు వెళ్లే దారిలో రోడ్లపై మట్టి పోయిస్తున్న పోలీసులు

పెంట్లవెల్లి, ఏప్రిల్ 7 : మండల కేంద్రం నుంచి కొండూరు వివిధ గ్రామాలకు వెళ్లే దారిలో రోడ్లపై గుంతలు ఏర్పడడంతో హెడ్‌కానిస్టేబుల్ రాజన్‌గౌడ్, కానిస్టేబుల్ మహేష్‌లు ట్రాక్టర్ల ద్వారా మొర్రం తెప్పించి రోడ్లపై పోసి గుంతలు పూడ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్లపై గుంతలు ఉండడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, రాత్రివేళల్లో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారనే ఉద్దేశంతో మట్టి పోయించామని వారన్నారు.